రాహుల్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



మధుయాష్కీ, రాంరెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఇతర పార్టీల నాయకులు

కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ

చైతన్యపురి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ రెడ్డి సంఘాల కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, ఆలయ చైర్మన్లు, కాలనీల అసోసియేషన్ నాయకులు సుమారు 600 మంది శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. చైతన్యపురి హనుమాన్‌నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై కాంగ్రెస్ కండువాలు కప్పి వారిని పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ, దేశంలో ప్రతి మహిళకు ఏడాదికి లక్ష రూపాయల సహాయం అందించాలనేది కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రధాన అంశమన్నారు. కార్మికులు, కర్షకులు, రైతులు, యువతకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ఐదు న్యాయ గ్యారంటీలు ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. దేశంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని, అందు కోసం రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీ కనీసం 15 సీట్లు గెలిచేలా అందరూ కృషి చేయాలన్నారు. మల్కాజిగిరి ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు లోపాయకారీ ఒప్పందంతో ఒక్కటై ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని, వారిని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్‌వీ కృష్ణప్రసాద్, వజీర్ ప్రకాష్‌గౌడ్, స్థానిక నాయకులు శశిధర్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, విజయరంగా, రవికేశవ నాయుడు, తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాసానిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం



బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ అంటే కేసీఆర్ అని, కేసీఆర్ అంటే తెలంగాణ అని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కేపురంలోని సురభి హోటల్‌లో శనివారం బీఆర్‌ఎస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతో కష్టపడి మంచి మెజార్టీతో తనను గెలిపించారని, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అదే ఉత్సాహంతో పనిచేసి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం అని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ 63 లక్షల మంది సభ్యత్వం కలిగిన పార్టీ అని, స్వలాభం కోసం కొంతమంది నాయకులు పార్టీ మారుతున్నారని, అలాంటి వారికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. నిరంతరం ప్రజలకు సేవ చేసే బడుగు బలహీనవర్గాల నాయకుడైన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలిపిద్దామని అన్నారు. 70 ఏళ్ల వయస్సు పైబడిన కేసీఆర్ ఎండిన పంటలను పరిశీలిస్తుంటే, ముఖ్యమంత్రి మాత్రం ఐపీఎల్ మ్యాచ్‌లను చూస్తూ సేద తీరుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శ్రీధర్, బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, సాజిద్, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతారెడ్డి, రామ్ నరసింహ గౌడ్, మహిళా అధ్యక్షురాలు లిక్కి ఊర్మిళా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు మంచి స్పందన



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్)కు మంచి స్పందన వస్తోందని, మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు వనస్థలిపురం, పరిసర కాలనీల ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారని మేళా నిర్వాహకుడు అక్బర్‌అలీ అన్నారు. మేళాలో దేశంలో పేరొందిన మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, చెప్పులు, గాజులు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయన్నారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని, కాలనీల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడిద్దాం: సీఐటీయూ



సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయూ నేత భూపాల్

మన్సూరాబాద్: కార్మిక వ్యతిరేక మతోన్మాద, కార్పొరేట్ అనుకూల బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడిద్దామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. 'ఎన్నికలు – కార్మికుల కర్తవ్యం' అనే అంశంపై మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆటోనగర్‌లో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు భూపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల హక్కులను కాలరాశారని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టిందని, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 27 శాతం ఉంటే దాన్ని 12 శాతానికి కుదించారని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, కార్మిక హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, ఈ ఎన్నికల్లో బీజేపీని గద్దె దింపి లౌకికశక్తులను గెలిపించుకోవాలని కోరారు. భువనగిరి పార్లమెంట్ పరిధి సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, నాయకులు వీరయ్య, వెంకన్న, చైతన్య, భీమానాయక్, లింగం యాదవ్, రాములు, బాలకృష్ణ, శివుడు, రావుల రాజు, యాదయ్య, శ్రీదేవి, సుభద్ర, సుగుణ, ఎల్లయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు



మన్సూరాబాద్‌లో వేడుకల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు ఎల్‌బీనగర్‌లో పలు ప్రాంతాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు పోచబోయిన జగదీష్‌యాదవ్ ఆధ్వర్యంలో కాస్మోపాలిటన్ కాలనీలో డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌ను కట్ చేశారు. నాయకులు భాస్కర్‌యాదవ్, జగదీష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, నాంపల్లి వెంకట్, శ్రీధర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

చంపాపేటలో...

బైరామల్‌గూడలో బీఆర్‌ఎస్ నేత గజ్జల మధుసూదన్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. చంపాపేటలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బైగల్ల రాము, రామలక్ష్మణ్, సిరికొండ నర్సింహారెడ్డి, కిరణ్, అభిభూ, మహ్మద్, సాయి, ఖదీర్ పాల్గొన్నారు.



చంపాపేటలో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తున్న నాయకులు



బైరామల్‌గూడలో జెండాను ఆవిష్కరించిన గజ్జల మధుసూదన్‌రెడ్డి తదితరులు

మురుగుమయం.. వరద కాలువ!

- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దుర్వాసన, దోమలు, ఈగల మోత
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



నిలిచిన మురుగు నీరు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు నుంచి దిలావర్‌ఖాన్ చెరువుకు నీరు వెళ్లే కాలువ మురుగుమయంగా తయారైంది. అక్కడ చెత్తా చెదారం చేరడంతో నీరు వెళ్లే మార్గంలేకుండా పోతోంది. ఇంజాపూర్‌లోని ఇందిరమ్మ కాలనీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద కాలువలో పూడిక పేరుకుపోయి కుంచించుకుపోవడంతో నీటి ప్రవాహం సక్రమంగా జరగడం లేదు. దీంతో ఇక్కడ మురుగునీరు చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకుండా రాత్రిళ్లు దోమలు, ఈగల మోత ఎక్కువైంది. ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు.

మొక్కుబడిగా ఫాగింగ్...

ఇంజాపూర్‌లోని పలు కాలనీలతో పాటు, కమ్మగూడలోని కాలనీల నుంచి వస్తున్న మురుగు నీరు ఈ కాలువ ద్వారా ప్రవహిస్తుంది. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు కాలువలో మట్టి పేరుకుపోయింది. ఆ మురుగు వెళ్లేమార్గంలేక ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దీంతో అక్కడ భరించలేని దుర్వాసనతో పాటు, దోమలు, ఈగలు ఎక్కువయ్యాయి. దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టే వారే లేరు. ఏదో మొక్కుబడిగా ఫాగింగ్ నిర్వహిస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ...

నిజానికి చెరువులు, కుంటల్లో, ఇళ్లల్లో నుంచి వెలువడే మురుగు నీరు నేరుగా చేరకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కానీ మున్సిపాలిటీ మొత్తంలో ఒక్కటి కూడా సీవరేజీ ప్లాంట్లు లేకపోవడంతో నేరుగా వ్యర్థాలు కాలువల ద్వారా చెరువులు, కుంటల్లో చేరుతున్నాయి. గతంలో సర్వే నెంబర్ 126లో ఎస్‌టీపీ నిర్మాణం చేపడతామని చెప్పినప్పటికీ అది నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ చెరువు పైన ఉన్నటువంటి మాసబ్ చెరువును బడంగ్‌పేట కార్పొరేషన్, తుర్కయంజాల్, రాగన్నగూడ, కమ్మగూడలోని ఆయా కాలనీల నుంచి వస్తున్న మురుగు నీరు మొత్తం నేరుగా చెరువులోనే కలుస్తుంది.

> **చర్యలు తీసుకుంటాం**
>
> మురుగు నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. రెండు రోజుల్లో కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే పనులు చేపడతాం. కుంచించుకుపోయిన చోట వెడల్పు చేయిస్తాం.
>
> – బి. సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్

ప్రతీ ఇంటికి వెళ్లి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలి

చాదర్‌ఘాట్: లోక్‌సభ ఎన్నికలు సజావుగా సాగేందుకు బూత్ లెవల్ అధికారులు సమర్థవంతంగా తమ విధులు నిర్వహించాలని మలక్‌పేట సర్కిల్–6 అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రాజేష్ అన్నారు. శనివారం మలక్‌పేటలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని ఏఆర్‌ఓ రాజేష్ సూచించారు. ఎవరైనా ఇంట్లో లేకపోతే పక్కవారిని పూర్తిగా వివరాలు అడిగి వారికి అందజేయాలన్నారు. ఏ ఒక్కరికి కూడా స్లిప్పులు మిస్ కాకుండా చూడాల్సిన బాధ్యత సూపర్‌వైజర్లపై ఉందన్నారు. బీఎల్‌ఓలపై ఫిర్యాదులు అందితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. టీపీఓ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా రవీందర్



రవీందర్‌కు నియామక పత్రం అందజేస్తున్న వలీ ఉల్లా సమీర్

సైదాబాద్: హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా సైదాబాద్ డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు కావేటి రవీందర్ నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు మహ్మద్ వలీ ఉల్లా సమీర్ శనివారం రవీందర్‌కు నియామక పత్రం అందజేశారు. అనంతరం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ పటిష్టతకు కృషి చేసే కార్యకర్తలకు కాంగ్రెస్‌లో తప్పక గుర్తింపు లభిస్తుందని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని హైదరాబాద్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి



వేం నరేందర్‌రెడ్డిని కలిసిన శ్రీనివాస్ గుప్తా

నాగోలు: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాకు సూచించారు. నరేందర్‌రెడ్డిని శనివారం ఆయన నివాసంలో శ్రీనివాస్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని, ఇంటింటికీ వెళ్లి పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేయాలని నరేందర్ రెడ్డి తనకు సూచించారని శ్రీనివాస్ గుప్తా తెలిపారు.

అభినందన

కాచిగూడ: కరాటేలో ప్రపంచ రికార్డు సాధించిన కాచిగూడ ప్రాంతానికి చెందిన కరాటే మాస్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డిని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అభినందించారు. శనివారం కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి కిషన్‌రెడ్డిని గోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డిని కేంద్రమంత్రి అభినందించి ఘనంగా సత్కరించారు. బీజేపీ నేతలు ఎ.సూర్యప్రకాష్ సింగ్, సి.నందకిషోర్ యాదవ్, అమృతరెడ్డి, సుభాష్ పటేల్, లక్నపురి సత్యనారాయణ, శీర్‌సాగర్ పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ గెలుపు తథ్యం



పోచమ్మగడ్డలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేతలు

చంపాపేట: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి ఘన విజయాన్ని కట్టబెట్టి మల్కాజిగిలో బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగురవేయటం ఖాయమని చంపాపేట డివిజన్ పార్టీ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పోచమ్మగడ్డ, మారుతీనగర్, ముస్లిం బస్తీ కాలనీలో లక్ష్మారెడ్డికి ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి సోదరుడు నర్సింహారెడ్డి, పార్టీ నాయకులు ఉమామహేశ్వర్, రోజారెడ్డి, రమాదేవి, వసంతరెడ్డి, నర్సింహ, రమేష్, రవిముదిరాజ్, ప్రభాకర్, అంజిరెడ్డి, జగదీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి: దేప



ఎన్టీఆర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న భాస్కర్‌రెడ్డి, గడ్డం ఆర్యన్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్‌రెడ్డి, గడ్డం రంజిత్‌రెడ్డి కుమారుడు గడ్డం ఆర్యన్ రెడ్డి కోరారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం ఎన్టీఆర్ నగర్‌లో గడప గడపకూ పాదయాత్ర చేస్తూ చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, ఆర్‌కే పురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, పిట్ట హరినాథ్ రెడ్డి, టీపీసీసీ ఎన్నికల ఇన్‌ఛార్జి నిజాముద్దీన్, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ నేత, యాదవ రెడ్డి, లింగస్వామి గౌడ్, జ్ఞానేశ్వర్ యాదవ్, పగడాల శ్రీశైలం, అక్బర్, ప్రేమ్ నాయక్, భూపాల్ రెడ్డి, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం



మహిళలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంజులారెడ్డి

మహిళామోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి

సైదాబాద్: దేశంలో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న నరేంద్ర మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని కావడం ఖాయమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం సైదాబాద్ డివిజన్ ఆస్మాన్‌ఘడ్‌కు చెందిన పలువురు మహిళలు మంజులారెడ్డి, కార్పొరేటర్ కొత్తకాపు అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మంజులారెడ్డి మాట్లాడుతూ, పదేళ్లుగా దేశంలో సుపరిపాలన అందిస్తున్న మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మహిళలు సహా అన్ని వర్గాల వారు బీజేపీలోకి చేరుతున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో హైదరాబాద్ నియోజకవర్గంలో మహిళామోర్చా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి పార్టీ అభ్యర్థి మాధవీలతను గెలిపించి నారీశక్తిని చూపిస్తామన్నారు. ప్రేమలత, వాణి, సునీత, అంజలి, రమ్య, కార్తీక, రాజేశ్వరి పాల్గొన్నారు.

సీఎం రోడ్డు షోను విజయవంతం చేయండి



రోడ్డు షో రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్‌బీనగర్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం వనస్థలిపురం సుష్మ చౌరస్తా నుంచి రైతు బజారు వరకు నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు షోను విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ కోరారు. సీఎం రోడ్డు షో రూట్ మ్యాప్‌తో పాటు కార్నర్ మీటింట్ ప్రాంతాన్ని శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మధుయాష్కీ మాట్లాడుతూ, రోడ్డు షో అనంతరం రైతు బజారు వద్ద కార్నర్ మీటింగ్ ఉంటుందని తెలిపారు. ఓడిపోతామని తెలిసి కూడా బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టి అతడిని బలి చేస్తోందని అన్నారు. బీజేపీ అభ్యర్థి గెలుస్తాడని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అనడం వారి మధ్య ఉన్న తెరచాటు ఒప్పందాన్ని బయటపెడుతోందని మధుయాష్కీ అన్నారు. సీఎం రోడ్డు షోలో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీ అధికార ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య సమాచారం మేరకు... గుర్తుతెలియని వ్యక్తి (50) బుద్వేల్–ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతున్నడు. ఈ క్రమంలో అటుగా వచ్చిన ఓ రైలు ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంసెట్, నీట్ పరీక్షలకు ఉచిత గ్రాండ్ టెస్ట్

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ శ్రీచైతన్య అకాడమీ విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29,30 తేదీల్లో ఎంసెట్, నీట్ పోటీ పరీక్షలకు ఉచిత గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ వీబీ రుషి తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 98857 34904 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

రేపటి నుంచి త్యాగరాజ స్వామి జయంతి ఉత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: భారతీయ కళాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి మే 5 వరకు సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి 257వ జయంతి ఉత్సవాలు, 23వ వార్షిక వాగ్గేయకార సంగీత ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. వేడుకల్లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తామని సమితి అధ్యక్షుడు నర్సింహారావు, ఉపాధ్యక్షుడు నారాయణ, సెక్రటరీ కృష్ణ తాండవ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

కొత్తపేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా రాజేష్ కుమార్



నాగోలు: బీజేపీ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడిగా మంచి రాజేష్‌కుమార్ నియమితులయ్యారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేయగా, నియామక పత్రాన్ని స్థానిక కార్పొరేటర్ పవన్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ, కొత్తపేట డివిజన్ నూతన బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన రాజేష్ కుమార్ గతంలో ఇదే డివిజన్‌కు నాలుగుసార్లు ప్రధాన కార్యదర్శిగా, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పనిచేశారని తెలిపారు. డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపునకు కృషి చేస్తానని రాజేష్‌కుమార్ తెలిపారు.

విజేత రిందా మెడోస్‌లో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: వేసవి కాలంలో చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని నాగోల్ ప్రధాన రోడ్డులో విజేత రిందా మెడోస్ అపార్ట్‌మెంట్‌లో శనివారం బాటసారులు, స్థానికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎండల తీవ్రతతో అవస్థలు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు చల్లటి మజ్జిగను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని, వాటికి తన సహాయ సహకారాలు అందజేస్తానని అన్నారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు రవి, సైదారావు, హనుమంత రావు, కృష్ణమూర్తి, అపార్ట్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



వార్షికోత్సవాల్లో పూజలు చేస్తున్న అర్చకులు

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీలోని శ్రీ గోధా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ 16వ వార్షికోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా శనివారం యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్టాపన, మూర్తి కుంభారాధన, నిత్యహవనం, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. వీటితో పాటు సంతానం లేని భక్తులకు గరుడ ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ, మే 1వ తేదీ వరకు ఈ వార్షికోత్సవాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, హోమాలు, యజ్ఞ మహోత్సవాలు ఉంటాయన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జగన్ రెడ్డి, ప్రధాన కార్యకదర్శి మహిపాల్‌రెడ్డి, ఆలయ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ బాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రగుప్తా, రాజశేఖర్‌రెడ్డి, సదానందం, నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి: వంగ



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

చంపాపేట: కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టడంతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే కాకుండా అగ్రదేశాల సరసన భారత దేశం సముచిత స్థానం దక్కించుకున్నదని చంపాపేట డివిజన్ కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంగ మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని మారుతీనగర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేసి విజయానికి సహకరించాల్సిందిగా అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవీందర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్ కుమార్, నవీన్, రవీందర్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 16, క్యారెట్ 31, దొండ 28, ఆలు 33, ఉల్లి 19, గోకర 35, దోస 15, సొర 09, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 45, మునగ 23, చిలగడదుంప 70.